## మాగంటి సంతాప సభ నేడు



దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంతాప సభకు ఆహ్వానిస్తున్న షేక్ పేట్ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్

వెంగళరావునగర్, జూన్ 24 : దివంగత జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ సంతాప సభను బుధవారం నిర్వహించనున్నట్లు బీఆర్ ఎస్ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ తెలిపారు. షేక్‌పేట్‌లోని సక్కుబాయి స్కూల్ ప్రాంగణంలో సాయంత్రం సంతాప సభ నిర్వహించనున్నామని..ఈ సందర్భంగా డివిజన్‌లో ఇంటింటికీ తిరిగి అందరికీ ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎల్లేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు

హిమాయత్ నగర్ ,జూన్ 24: నారాయణ గూడ పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైలు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎస్సైలు వెంకటేశ్,షఫీ బదిలీకాగా వారి స్థానంలో ఎస్సైలు జె.శ్రీకాంత్‌రెడ్డి, బి.ఎస్.శ్రీవాణి,డి.ఎస్.రాజు వచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

### నియోజకవర్గ అభివృద్ధికి కృషి

గోల్నాక, జూన్ 24: అంబర్‌పేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా, ప్రజల సహకారంతో సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సమస్యలను తెలుసుకోవడానికి మార్నింగ్ వాక్‌లో భాగంగా మంగళవారం ఉదయం గోల్నాక డివిజన్ లోని కమలానగర్, గంగానగర్, న్యూగంగానగర్, మారుతీనగర్ తదితర ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర నిర్వహించారు. స్థానికులను పేరు పేరునా పలకరిస్తూ వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీలు పొంగిపొర్లడం, మంచినీటి సరఫరాలో సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

# వెలగని వీధి దీపాలు..

**బస్తీలు, కాలనీల్లో కమ్ముకున్న చీకట్లు - మరమ్మతులు,కొత్త దీపాల ఏర్పాటులో నిర్లక్ష్యం - చీకట్లో ఇబ్బందులు పడుతున్న స్థానికులు**



హైదర్‌గూడలో వెలగని వీధి దీపాలు

హిమాయత్ నగర్, జూన్ 24: వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేక పలు ప్రాంతాల్లో సమస్య జఠిలమై వీధులు చీకట్లు కమ్ముకుంటు న్నాయి. నిర్వహణను విస్మరించడంతో కొన్ని చోట్ల రోజంతా వెలుగుతుండగా మరికొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళ చీకట్లు నెలకొంటున్నాయి. బస్తీలు, కాలనీలు అంధకారం నెలకొనడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్న వెలుగులు పంచకపోవడంతో రాత్రివేళ్లలో భయంతో వాహన దారులు రాకపోకలు సాగిస్తున్నారు. కొన్ని నెలలుగా సమస్య నెలకొన్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. హిమా యత్ నగర్ డివిజన్ పరిధిలో దాదాపు 800కు పైగా వీధి దీపాలు ఉండగా వాటిలో కొన్ని మాత్రమే వెలుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీటిలో కొన్ని వీధి దీపాలు టైమర్ల సహాయంతో ఆటోమెటిక్‌గా వెలగడం, ఆఫ్ అవుతుండగా మిగిలిన వాటిన్ని మ్యాన్‌వల్‌గానే నిర్వహిస్తున్నారు. నారాయణగూడ, హైదర్‌గూడ, హిమాయత్ నగర్, చంద్రానగర్, కింగ్‌కోఠి, ముత్యాల్‌బాగ్ తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలుగకపోవడంతో కారు చీకట్లు అలుముకున్నాయి. రాత్రి సమయంలో చీకటిగా ఉండటం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. వీధి దీపాలు వెలుగడం లేదనే విషయం ఉన్నతాధికారులకు తెలిసినా కిందిస్థాయి సిబ్బందిని ముందుకు నడిపించడంలో విఫలమవుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

### మరమ్మతులు చేసి.. సమస్యను పరిష్కరిస్తాం

బస్తీలు, కాలనీల్లో పర్యటించి వీధి దీపాల పరిస్థితిని పరిశీలించి సమస్య ఎక్కడ ఉందో తెలుసుకుని పరిష్కరిస్తాం. ఇప్పటికే తమ తమ దృష్టికి వచ్చిన ప్రాంతాల్లో మరమ్మతు లు చేయించి సమస్యను పరిష్కరిస్తున్నాం.పాత వాటికి మరమ్మతులు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో పాత వాటిని తొలగించి కొత్త దీపాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

*ఏఈ సామ్య, జీహెచ్‌ఎంసీ స్ట్రీట్ లైట్స్ అధికారి*

## స్పోర్ట్ స్ కాంప్లెక్స్‌ను త్వరగా పూర్తి చేయండి



కాటేదాన్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్**

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 24: కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అసంపూర్తిగా ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం చార్మినార్ జోన్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్విమ్మింగ్ పూల్‌కు వాటర్ కనెక్షన్ కోసం జలమండలి అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. వాటర్ కనెక్షన్, షెటిల్ బ్యాడ్మింటన్ ఆట స్థలం పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ వెంకన్న, ఏసీ స్పోర్ట్స్ యాదగిరిరావు, జోనల్ ఎస్సీ మహేశ్వర్‌రెడ్డి, సీఈ రత్నాకర్, ప్రాజెక్ట్ ఈఈ కె.ఎల్.శ్రీనివాస్, రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ పాల్గొన్నారు.

## అక్షయపాత్రకు అప్పగించొద్దు

### మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకుల డిమాండ్



మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించవద్దని విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

శంషాబాద్ రూరల్, జూన్ 24 : మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు(అక్షయపాత్రకు)అప్పగిస్తున్నట్లు శంషాబాద్ ఎంఈవో ఆయా పాఠశాల హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశారని వాటిని వెంటనే రద్దు చేయాలని కోరుతూ మంగళవారం శంషాబాద్ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ పనులు చేస్తున్నా మా బతుకు దేరువుపై దెబ్బకొట్టడం ఏమిటని ప్రశ్నించారు. వినతి పత్రం అందజేసిన వారిలో కార్మికుల సంఘం అధ్యక్షుడు గణేష్, రాజే ష్, నర్సింగ్, రాములు, సంతోషమ్మ, లావా ణ్య, కమలమ్మ,రజిత, భారతమ్మ, రమాదేవి, శారదమ్మ,జయమ్మ, వీరాబాయి, సువర్ణ, సునీత, వాలి, లక్ష్మమ్మ, మయూరిలు ఉన్నారు.

## పీర్లను రాష్ట్ర పండుగగా గుర్తించాలి



అభివాదం చేస్తున్న కోదండరాం, సత్యనారాయణ తదితరులు

ఖైరతాబాద్, జూన్ 24: పీర్ల పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించాలని వక్తలు కోరారు. మోహరం పండుగ నిర్వాహకుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, టీఎఫ్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు కాచం సత్యనారాయణ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్‌లు పాల్గొని ప్రసంగించారు. పీర్ల పండుగ సబ్బండ వర్గాలు నిర్వహించే తెలంగాణ సాంస్కృతిక చిహ్నం అన్నారు. బతుకమ్మ, బోనాల మాదిరిగా పీర్ల పండుగకు సైతం గుర్తింపు ఇవ్వాలన్నారు. త్యాగాలకు కులం, మతం, ప్రాంతీయత ఉండదన్నారు. పీర్ల పండుగకు సెలవు ఇవ్వడంతో పాటు వేడుకలకు ప్రభుత్వం సంపూర్ణంగా సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ రచయిత, కవి మాస్టర్, టీఎఫ్ టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, మొహరం పండుగ నిర్వాహకుల సంఘం అధ్యక్షుడు గట్టన్న, శ్రీధర్, సాజిరా సికందర్.పి. విజయ్ కుమార్, బాలకృష్ణ, ముజీబ్, చారి, గోపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దోమలు వృద్ధి చెందకుండా ప్రత్యేక చర్యలు



సాయిబాబానగర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 24: వర్షాకాలంలో దోమలు వృద్ధిచెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ రవికుమార్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ సాయిబాబానగర్‌లో ఎంటమాలజీ విభాగం అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చాలా రోజులుగా నిల్వ ఉన్న టైర్లు, ట్యూబ్‌లు, పూల కుండీలు లేకుం డా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది ప్రతి రోజూ దోమలు వృద్ధి చెందకుండా మందు స్ప్రే చేస్తున్నారన్నారు. సాయంత్రం సమయంలో బస్తీలలో ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 24: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. త్రిశూల్ ఫీడర్‌లో ఉదయం 9:30 నుంచి 12:30 వరకు త్రిశూల్ విల్లాస్, అపర్ణ త్రిలోక్, శాతంరాయి గ్రామ ఫీడర్‌లో ఉదయం 10:30 నుంచి 12:30 వరకు సుచిత్ర ఇండియా విల్లాస్, శాతంరాయి గ్రామం, పాశం బండా తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలన్నారు.

## వేంకటేశ్వర ఆలయం భూమి వేలం



చేవెళ్ల పట్టణంలో శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ భూమి వేలం పాటలో మల్కారం గ్రామంలోని భూమిని దక్కించుకున్న రైతు శ్రీరాములు

శంషాబాద్ రూరల్, జూన్ 24 : శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ భూములను మంగళవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణంలోని ఆలయంలో నిర్వహించారు. ఆ ఆలయానికి సంబంధించిన భూమి శంషాబాద్ మండలంలోని మల్కారం గ్రామంలో ఉంది. గ్రామంలోని సర్వే నంబర్ 213లో 1.35 గుంటల భూమిని వేలం పాటలో అదే గ్రామానికి చెందిన రైతు శ్రీరాములు రూ. 29,500 వేలకు దక్కించుకున్నారు. అనంతరం శంషాబాద్ మండలంలోని మల్కారం గ్రామంలో రైతు మాట్లాడుతూ వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తున్న తాను శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం భూమిని వేలం పాటలో దక్కించుకున్నట్లు తెలిపారు.



### గోల్కొండ బోనాలకు ఆహ్వానం

*తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ రూపొందించిన ఆహ్వాన పత్రికను మంగళవారం అత్తాపూర్ డివిజన్ లక్ష్మీనగర్ పార్కులో తెలంగాణ కుమ్మర సంఘం, తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు నేదునూరి కనకయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి కొల్లూరి అనిల్‌కుమార్, కాకులారం శంకర్, బ్రహ్మయ్యనాయుడు, యోగా సెంటర్ ప్రతినిధి మిట్టపల్లి నర్సింహారావు, వాకర్ అసోసియేషన్ ప్రతినిధి బుచ్చయ్య, పర్యావరణవేత్త తిమ్మారెడ్డి, ఉత్సవ సమితి కోశాధికారి ధామ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.*

*– మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 24:*

## చదువుతో పాటు మధ్యాహ్న భోజనం



సుశీల వామనరావు స్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

బంజారాహిల్స్,జూన్ 24:పేద విద్యార్థుల కోసం పంజాగుట్ట ప్రతాప్‌నగర్ బస్తీలోని కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న సుశీల వామన్ రావు మెమోరియల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పదిరోజుల క్రితం పేదల కోసం ఉచిత విద్యను అందిస్తున్న స్కూల్‌కు తాళం వేసిన ఘటనపై నమస్తే తెలంగాణ కథనంతో స్పందించిన విద్యాశాఖ అధికారులు, పోలీసులు పంజాగుట్ట ప్రతాప్ నగర్లోని కమ్యూనిటీహాల్‌లో స్కూల్ కొనసాగేందుకు అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం నుంచి పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఫౌండేషన్ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాలతి, కృష్ణ, జ్యోతి, నాగబాబు, ఉష, శారద, మాధవి తదితరులు మాట్లాడుతూ తాము విద్యార్థుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా విద్యను అందిస్తున్నామని, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, షూస్ కూడా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

## బైక్ దొంగల అరెస్టు



అమెర్ ,మహమ్మద్ సల్మాన్ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 24: బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాటేదాన్ మార్కెట్‌లో సోమవారం ఉదయం ఓ వ్యక్తి వచ్చి బైక్‌ను పార్క్ చేసి కూరగాయలు కొనుకుని వచ్చి చూడగా తన బైక్ కనిపించలేదు. మరోవ్యక్తి తన ఇంటి ముందు పార్కు చేసిన బైక్ ఉదయం లేచి చూడగానే కనిపించలేదు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ పుటేజీ ఆధారంగా ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అమెర్ పాషా(19), మహమ్మద్ సల్మాన్ (19)లను అదుపులోకి తీసుకొని విచారించగా రెండు వాహనాలను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎంఈవో లక్ష్మణ్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, తదితరులు

శంషాబాద్ రూరల్, జూన్ 24 : ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఎంఈవో లక్ష్మణ్ నాయక్‌కు సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంషాబాద్ పట్టణంలో దాదాపు 50కి పైగా ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వాటి ఆవరణలోనే చట్టవిరుద్ధంగా వచ్చినట్లు ఆకర్షణీయంగా పేర్లు పెట్టుకొని మధ్యతరగతి, కుటుంబాల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. శంషాబాద్ పట్టణంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలో ఇదే తంతు కొనసాగుతుందని వివరించారు.

## ముచ్చింతల్ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

### మైహోం గ్రూపు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ జూపల్లి జగపతిరావు



ముచ్చింతల్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మైహోంగ్రూపు సంస్థల ఎండీ జూపల్లి జగపతిరావు, తదితరులు

శంషాబాద్ రూరల్, జూన్ 24 : ముచ్చింతల్ ప్రభుత్వ పాఠశాలను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మైహోం గ్రూపు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ జూపలల్లి జగపతిరావు తెలిపారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాలకు చేరుకొని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్,హెచ్‌ఎం ఉమామహేశ్వరిలతో కలిసి పాఠశాలలోని తరగతి గదులు, విద్యాబోధన,మంచి నీటి సౌకర్యం,మూత్రశాలలు తదితర విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముచ్చింతల్ ప్రభుత్వ పాఠశాలను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. జూపల్లి బాలమ్మ ట్రస్ట్ ద్వారా నూతన భవనం నిర్మాణం చేసి పాఠశాలకు అప్పగించిన్నట్లు తెలిపారు. ముచ్చింతల్ చుట్టు పక్కల గ్రామాలలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలో చేర్పించడంతో వేలకు వేల రూపాయలు డబ్బులు వృథా కావడంతో పాటు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వివరించారు. పాఠశాల చుట్టు పక్కల గ్రామాలకు ఖుషి ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో రవాణా సౌకర్యం కల్పిస్తుండడంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి దాదాపు 1160 మంది విద్యార్థులు ముచ్చింతల్ పాఠశాలలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బీర్ల పెంటయ్య, వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్‌లు రాజు, రాఘువేందర్‌లతో పాటు పలువురు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీల కోసం పోరాటం చేస్తాం: మందకృష్ణ



వ్యవసాయ వర్సిటీలో పాల్గొన్న పద్మశ్రీ అవార్డు గ్రహిత మందకృష్ణ

వ్యవసాయ యూనివర్సిటీ, (హైదరాబాద్) జూన్ 24 : ఎమ్మార్పీఎస్ అనేక ఉద్యమాలు చేపట్టి ,మంచి ఫలితాలు సాధించిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం ఆయన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల పద్మశ్రీ అవార్డు గ్రహితను యూనివర్సిటీ సన్మానించింది. యూనివర్సిటీలోని సమస్యలను తెలుసుకోవడానికి వచ్చిన ఆయన పలు అంశాల మీద సుధీర్ఘంగా మాట్లాడారు. ప్రారంభం నుంచి నేటి వరకు ఎమ్మార్పీఎస్ ఉద్యమాల ద్వారా ఫలితాలను సాధించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మలివిడత ఉద్యమంలో నాటి ఉద్యమకారుడు మాజీ సీఎం కేసీఆర్‌కు అండగా నిలిచిందన్నారు.రాబోవు కాలంలో బీసీలకు రిజర్వేషన్ అమలుపై పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం తమ మ్యానిఫెస్టోలో ఎంఆర్పీఎస్ తీసుకున్న ఏ నిర్ణయాన్ని తప్పు పట్టలేకపోయాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు.. ఈనెల 27 నుంచి మరో ఉద్యమానికి రూపకల్పన చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీసీల శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ వారికి ఇప్పటికీ చట్టసభలో ఎలాంటి ప్రాధాన్యత లేదని, అందుకని ఈ ఉద్యమాన్ని మరింత ఉద్రిక్తం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఈశ్వరి,ఉద్యాన కళాధర్ బాబు , వెటర్నరీ విశ్వవిద్యాలయం నుంచి వెంకట్ రాములు ఆయా సంఘాల నాయకులు డాక్టర్ సురేష్ పవన్ చంద్రారెడ్డి బాలాజీ నాయుడు రామచంద్రా రెడ్డి కళాశాల అసోసియేట్ గోవర్ధన్, విద్యార్థి సంఘాల నాయకులు రాజ్ కుమార్ ,వినయ్ కుల సంఘాల నాయకులు, మందకృష్ణను సన్మానించారు.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



*మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి కొంపల్లి జగదీష్, సంస్కృతిక కార్యదర్శి గోంత్యాల శ్రీనివాస్‌లు హాజరై విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శంకర్, లత, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు. – మైలార్‌దేవ్‌పల్లి*



*శంషాబాద్ పరిధిలో..ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకుడు , మాజీ వార్డు సభ్యుడు వీరచారి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని సుల్తాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 1 తరగతి నుంచి 5 తరగతి చదువుతున్న విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, స్టేషనరిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు మాలకృష్ణ,చాకలి దేవేందర్, మహేష్‌గౌడ్, ఎక్బాల్, శ్రీకాంత్‌యాదవ్, బల్వంత్‌రెడ్డి,శ్రీను పాల్గొన్నారు. –శంషాబాద్ రూరల్*



### పదో తరగతి విద్యార్థులకు నగదు బహుమతులు

*యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి (2024-25) పరీక్షలల్లో 500 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు సామాజిక వేత్త ధర్మారావు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ ఎం బి. నరసింహ, పదో తరగతి ఉపాధ్యాయులు శ్రీ వాత్సవ, భ్రమరాంబ, హన్మంత రావు, ముంతాజ్, టీచర్లు ప్రభాకర్, శ్రీనివాసన్, నాగరాజు, శాంతి పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్*

## మసాజ్ సెంటర్‌పై పోలీసుల దాడి

వెంగళరావునగర్: మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళతో పాటు ముగ్గురు యువతులను పోలీసులు పట్టుకున్నారు. ఎస్.ఆర్.నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజేందర్‌నగర్ కు చెందిన రంగా సురేఖ (45) ఎస్. ఆర్.నగర్ లోని కమలా నివాస్ అపార్ట్‌మెంట్ విక్టోరియా బ్యూటీ సెలూన్ అండ్ స్పా నడుపుతుంది. యువతులను ఎరగా వేసి వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం సీసీఎస్ యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ వింగ్ పోలీసులు దాడులు చేసి నిర్వాహకురాలితో పాటు ముగ్గురు యువతులు,ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును ఎస్.ఆర్. నగర్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమో దు చేసకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### డ్రగ్స్ విక్రయ దారుడి అరెస్ట్

బండ్లగూడ,జూన్ 24: డ్రగ్స్ విక్రయిస్తున్న యువకుడిని శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెందిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వట్టి జగదీశ్వర్‌రెడ్డి అనేక యువకుడు మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని ఓ హోటల్ వద్ద ఎండీఎంఏ అనే డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆ హోటల్ పరిసర ప్రాంతాల్లో రూట్ వాచ్‌ను నిర్వహించారు. ఈ ఘటనలో జగదీశ్వర్‌రెడ్డి ఎండీఎంఏ డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసులో జగదీశ్వర్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి 23గ్రాముల ఎండీఎంఏ,ఫోన్,పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.



### విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ తెలంగాణ రాష్ట్ర పొలిటికల్ వింగ్ కన్వీనర్‌గా శివచారి

విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ తెలంగాణ రాష్ట్ర పొలిటికల్ వింగ్ కన్వీనర్‌గా శివచారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ యువత తరపున విశ్వకర్మ యువ యాత్ర పేరుతో హైదరాబాద్ నుంచి శ్రీశైలం వరకు బైక్ యాత్రను నిర్వహించామన్నారు. ఈ యాత్ర ద్వారా విశ్వకర్మ జాతికి ఐక్యత, పరస్పర స్నేహం, సామాజిక అవగాహన కలించాలనే సంకల్పంతో నిర్వహించామన్నారు. – మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 24